ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి జిల్లా

ఆదివారం, నవంబర్ 15, 2026 పేజీలు : 6

షాద్‌నగర్‌లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

నిందితురాలి అరెస్ట్ - సుమారు 2.5 తులాల బంగారు చెవికమ్మలు స్వాధీనం



రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్): షాద్‌నగర్ పట్టణంలో బంగారు ఆభరణాలదుకాణంలో జరిగిన చోరీ కేసును ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ పోలీసులు ఛేదించారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి చోరీకి పాల్పడిన మహిళను గుర్తించి అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి సుమారు 2.5 తులాల బంగారు చెవికమ్మలను స్వాధీనం చేసుకున్నారు.

బంగారు ఆభరణాలు చూపించమంటూ వచ్చి చోరీ..

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీకృష్ణ జువెలర్స్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ నెల12వ తేదీన మధ్యాహ్నం సుమారు 2.30గంటల సమయంలో 40నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ మహిళ బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాలనే నెపంతో దుకాణానికి వచ్చింది. సుమారు 5.2అడుగుల ఎత్తు, గుండ్రటి ముఖం, గోధుమ వర్ణంతో ఉన్న ఆమె ఊదా రంగు చీర ధరించి ఉంది.దుకాణంలో పని చేస్తున్న సేల్స్ గర్ల్స్ గాయత్రి, ప్రజ్ఞతిలను వివిధ రకాల బంగారు చెవికమ్మల డిజైన్లు చూపించాలని కోరింది. ఆభరణాలను పరిశీలిస్తున్నట్లు నటిస్తూ, సిబ్బందిదృష్టిని మరల్చి వారి ప్రమేయం లేకుండానే సుమారు 2.5 తులాల బరువున్న బంగారు చెవికమ్మలను చాకచక్యంగా తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది.

సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో నిందితురాలి గుర్తింపు

చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దుకాణంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితురాలి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.ఈ క్రమంలో నిందితురాలిని మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పుల్పోనిపల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని మార్లో నివాసం ఉంటున్న కుమ్మరి రాజమణి (45)గా గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

రూ.లక్షల విలువైన బంగారం స్వాధీనం


నిందితురాలి నుంచి సుమారు 2.5 తులాల బంగారు చెవి కమ్మలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 995/2026, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 318(4), 305కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు షాద్‌నగర్ పట్టణ సిఐ సీతారాం వెల్లడించారు.

పోలీసు అధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు

ఈ కేసు ఛేదనలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో డీసీపీ, ఏసీపీ, షాద్‌నగర్ సీఐ సీతారాం, ఎస్ఐలు, డీఎస్ఐ, క్రైమ్ టీమ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితురాలిని గుర్తించి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

కొత్త పాండుగౌడ్ సేవలు చిరస్మరణీయం

నర్సాయపల్లి గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తా : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాడ్గుల, నవంబర్ 14 (ప్రజాదర్బార్): ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొత్త పాండుగౌడ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ నర్సాయపల్లి గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.శనివారం మాడ్గుల మండలపరిధిలోని నర్సాయపల్లిగ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి అధ్యక్షతన కొత్త పాండుగౌడ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాండు గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాండు గౌడ్ ప్రజా జీవితంలో ఉంటూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని, ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడారని గుర్తుచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భార్య జ్యోతి, కుమార్తె, కుమారుడికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి

నర్సాయపల్లి గ్రామ అభివృద్ధి కోసం పాండు గౌడ్ పలుమార్లు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. నర్సాయపల్లినుంచి అప్పారెడ్డిపల్లిమీదుగా కుర్మేడ్‌గేట్ వరకు రోడ్డునిర్మాణానికి నిధులు మంజూరుచేయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అర్హులైన నిరుపేదలకు (మిగతా 2వ పేజీలో.)

ఆక్రమణలకు గురైన భూమికి పూర్తి స్థాయిలో పెన్సింగ్ ఏర్పాటు చేయాలి

: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్





ఆదిభట్ల, నవంబర్ 14 (ప్రజాదర్బార్): ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించే వరకు బీజేపీ పోరాటం ఆగదని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పేరిట మార్చి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారంటూ కొందరు అధికారులు, రాజకీయ నాయకులు, మధ్యవర్తులు, ల్యాండ్ బ్రోకర్ల తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భూమి ఒక్క అంగుళం కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూరు డివిజన్ మునగనూరులో 44వ సర్వే నంబర్ భూమి వద్ద శనివారం 53, 56వ డివిజన్ల బీజేపీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత విలువైన భూములు కలిగిన రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆస్తులుగా ఉండాల్సిన ప్రభుత్వ భూములు కొందరి స్వార్థ ప్రయోజనాలకు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పాత రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు

మునగనూరు 44వ సర్వే నంబర్‌కు (మిగతా 2వ పేజీలో..)

దున్నపోతుల విన్యాసాలతో హోరెత్తిన సదర్ ఉత్సవం

మన సంస్కృతి, యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీకగా పేర్కొన్న మల్‌రెడ్డి






ఇబ్రహీంపట్నం, నవంబర్ 14 (ప్రజాదర్బార్): ఇబ్రహీం పట్నంలో నియోజకవర్గస్థాయిలో యాదవ సంఘం ఆధ్వ ర్యంలో శుక్రవారం రాత్రి యాదవ సంఘం ఇబ్రహీంపట్నం అధ్యక్షులు ముంతా శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన సదర్ సమ్మేళనం అంబరాన్నంటింది. దున్నపోతుల విన్యాసాలు, యువత ఉత్సాహం, సాంప్రదాయ కళారూపా లు, డప్పు చప్పుళ్లు, జయజయధ్వానాలతో అంబేద్కర్ చౌ రస్తా హోరెత్తింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా జరిగిన ఈ వేడుకలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతుల విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకోగా, సదర్ వేడుకల సందడి పట్టణమంతా పండుగ వాతావరణాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డిలకు యాదవ సంఘం నాయకులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. దున్నపోతును ఆడిస్తూ... మల్‌రెడ్డి రంగారెడ్డి అక్కడున్న వారిలో జోష్ నింపారు. సదర్ వేడుకలు కేవలం ఉత్సవాలు మాత్రమే కాదని, యాదవుల ఐక్యతకు, ఆత్మ గౌరవానికి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాదవ సోదరులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ఐకమత్యంతో అభివృ ద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. ఇలాంటి సాం స్కృతిక వేడుకలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. మల్‌రెడ్డి అభిషే క్‌రెడ్డి సైతం వేడుకల్లో పాల్గొని యువతలో ఉత్సాహాన్ని పంచుకున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొని సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చదువు సామగ్రి పంపిణీ

: టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొత్తకురుమ శివకుమార్



ఆదిభట్ల, నవంబర్ 14 (ప్రజా దర్బార్): బాలల దినోత్సవా న్ని పురస్కరించుకుని జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్క యంజాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. శనివారం పాఠశాలలో నిర్వహిం చిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొత్తకురుమ యశ్వంత్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడ్ల అర్జున్ హాజరయ్యారు. వారు విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను స్వయంగా అందజేసి బాలల దినో త్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో బాల్యం ఎంతో ముఖ్యమైన దశఅని,ఈ సమయంలో నేర్చు కునే విద్య, క్రమశిక్షణ, మంచి అలవాట్లు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి పునాదిగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ కష్టపడి చదవాలని, చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు పట్టుదలతో ముందు కు సాగాలని సూచించారు. నేటి బాలలే రేపటి భావి భారతపౌరులని, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని పేర్కొన్నా రు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండా లని, ఆర్థిక పరిస్థితులు ఏవైనా విద్యార్థులు చదువులో వెనుకబడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. బాలల దినోత్స వం సందర్భంగా విద్యార్థులకు చదువు సామగ్రి అందిం చడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్య, శ్రీనివాస్ చారి, గలయ్య, అనిల్ కుమార్, రాజేందర్, రాధిక, సరిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

కొత్త పాండుగౌడ్ సేవలు చిరస్మరణీయం

(1వ పేజీ తరువాయి)

ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే, ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి పేర్కొన్నారు.ఈ సంస్మరణ సభలో మాజీ జెడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్‌రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతానరసింహ, ఫ్యాక్స్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు బట్టు అనురాధ కిషన్ రెడ్డి, రాధారాంరెడ్డి, గజ్జ స్వాతిసత్యంగౌడ్, ఆమనగంటి భాస్కర్‌రెడ్డి, కాస సత్యనారాయణ, బావండ్లపల్లి కోటయ్య, జగన్‌గౌడ్, మాడ్గుల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూదిని కొండల్ రెడ్డి, సూదిని శ్రీనివాస్‌రెడ్డి, గౌని నరసింహగౌడ్, గౌని వెంకటయ్య గౌడ్, గ్యార నర్సింహ, జల్ల రమేష్‌గౌడ్, కొండల్ రెడ్డి, కొప్పు ల జగన్ గౌడ్, కొప్పుల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, అభిమానులు, నాయకులు, మాజీ ప్రజాప్రతి నిధులు పెద్ద సంఖ్యలో హాజరై పాండు గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ఆక్రమణలకు గురైన భూమికి పూర్తి స్థాయిలో పెన్సింగ్ ఏర్పాటు చేయాలి

(1వ పేజీ తరువాయి)

సంబంధించిన భూమి నిజాం కాలం నాటి రికార్డులతో పాటు 1954--58 మధ్యకాలపు రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నట్లు తమకు సమాచారం ఉందని బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. అలాంటి భూమిని ప్రైవేటు భూమిగా మార్చి రిజిస్ట్రేషన్లు చేయడం వెనుక ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డుల్లో భూమి స్వరూపం ఎలా మారింది? రిజిస్ట్రేషన్లకు ఏ ఆధారాలు చూపించారు? ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర ఏమిటి? అనే అంశాలను ప్రభుత్వం నిగ్గు తేల్చాలని కోరారు.

ఎన్ని అంతస్తులైనా అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

ప్రభుత్వ భూముల్లో ఎన్ని అంతస్తుల భవనాలు నిర్మించినా అక్రమాలకు చట్టపరంగా అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు. భూమిని దాచిపెట్టడం లేదా దాని స్వరూపాన్ని మార్చడం సాధ్యం కాదని, సర్వే నంబర్లు, జియో మ్యాపులు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా భూముల అసలు వివరాలను గుర్తించవచ్చని వివరించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పేరిట మార్చేందుకు సహకరించిన అధికారులు, రాజకీయ నాయకులు, మధ్యవర్తులపై విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ బ్రోకర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు బీజేపీ అధికారంలోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ప్రత్యేక జైలు నిర్మిస్తామని వ్యాఖ్యానించారు.

ప్రజల కోసం పార్కులు, ఆసుపత్రులు.. 'మోదీ టవర్స్'

ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటే వాటిని ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాలకు కాకుండా ప్రజల అవసరాలకు వినియోగిస్తామని బూర నర్సయ్య గౌడ్ ప్రకటించారు. హెచ్ఎండీఏ పార్కులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ సెంటర్లతో పాటు పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన తదితర గృహ నిర్మాణ పథకాల ద్వారా 'మోడీ టవర్స్' నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు వాటిని ప్రజలకు ఉపయోగపడే ఆస్తులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను బీజేపీ నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, భూముల రికార్డులను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోసుపల్లి ప్రతాప్, బచ్చిగళ్ళ రమేష్, కొండ్రు పురుషోత్తం, కొత్త రామ్ రెడ్డి, తుళ్ళ నరసింహ గౌడ్, కరాడి అనిల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, యూసుఫ్ రెడ్డి, పావన్న గౌడ్, కందాల బల్దేవ్ రెడ్డి,నోముల కార్తీక్ గౌడ్,రవీందర్ రెడ్డి,ఎలిమినేటి భరత్ రెడ్డి, నందగిరి సురేష్ గౌడ్, మహిళలు వర్మాల వీణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇండ్లు




నందిగామ నవంబర్ 14 (ప్రజాదర్బార్): తెలంగాణ రాష్ట్రంలో ఆటో కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం 'ఆటోనగర్ కాలనీ' పేరుతో ప్రత్యేక గృహ నిర్మాణ పథకాన్ని ప్రకటించిన తరుణంలో నందిగామమండల కేంద్రంలో గ్రామసర్పంచ్ కొమ్ము కృష్ణ, మండ ల అధ్యక్షుడు దేపల్లె కుమార్‌గౌడ్ స్వయంగా ఆటో నడుపు తూ ఆటో కార్మికులకు,గిగ్ వర్కర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, బొమ్మగళ్ళ నర్సింలు, మాజీ చైర్మన్ కుందారపు వెంకట్ రెడ్డి, కేశమోని రామచందర్, కృష్ణ గౌడ్, ఎర్రగారి రమేష్, సీఎం నరేందర్ రెడ్డి, అభిరెడ్డి, రేపల్లె శ్రీశైలం, రహమత్ అలీ,అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల సేవలో 40 రోజుల అన్నదాన కార్యక్రమం

భక్తిశ్రద్ధలతో భిక్షా సమారాధన ప్రారంభం..

గురుస్వామి సతీష్‌నాయర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్): అయ్యప్ప స్వా ముల పవిత్ర మండల దీక్షను పురస్కరించుకుని షాద్‌నగర్ పట్ట ణంలో 40 రోజుల పాటు నిత్య అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని వినాయక గుడి ఎదురుగా శ్రీశ్రీశ్రీ గురు బ్రహ్మ సతీష్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో భిక్షా సమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.మండల దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు ప్రతిరోజూ అన్నప్రసాదం అందించా లనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహ కులు తెలిపారు. 40 రోజుల పాటు నిరంతరంగా అన్నదాన వితరణ కొనసాగుతుందని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు, దాతలు, స్థానిక ప్రజలకు కూడా అన్నప్రసాదం అందించనున్నట్లు వెల్లడించారు.

అన్నదానంలో భాగస్వాములు కావాలి

అన్నదానం మహాదానమనే స్ఫూర్తితో చేపట్టిన ఈ పవిత్ర సేవా కార్యక్రమానికి భక్తులు, స్వాములు, దాతలు సహకారం అందించా లని నిర్వాహకులు కోరారు. భక్తుల సహకా రంతో 40 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం గా కొనసాగిస్తామని తెలిపారు. అయ్యప్పస్వాముల సేవలో భాగ స్వాములై ఆధ్యాత్మిక కార్యక్రమానికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు.

ఘనంగా భారత తొలి ప్రధాని, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ తదితరులు

రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్): భారత తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను పురస్కరించుకుని షాద్‌నగర్ పట్టణంలోని లక్ష్మీనరసింహకాలనీలో ఘనంగా నివాళులర్పించారు. 24వవార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్‌చైర్మన్ అగ్గనూర్ విశాల విశ్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశ తొలి ప్రధానిగా దేశ అభివృద్ధికి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆధునిక భారత దేశ నిర్మాణానికి పునాదులు వేసిన నాయకుడిగా ఆయన దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. దేశంలో పారిశ్రామిక, విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి నెహ్రూ విశేష ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి, దేశ సమగ్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్ మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, అప్పి, బచ్చలి నరేష్, దిలీప్, మాజీ కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్, జాంగారి రవి, టాప్సన్ వెంకటేష్, కత్తి చంద్రశేఖర అప్ప, తంగడపల్లి శంకర్, అగ్గనూర్ కిట్టు, మంగ మధు, గుడిపల్లి బీరప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు, విద్యార్థులు తదితరులు నెహ్రూకు నివాళులర్పించారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు అన్యాయం

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ గుప్తా



రంగారెడ్డి బ్యూరో, 14 నవంబర్ (ప్రజాదర్బార్) : కాంగ్రెస్ ప్రభు త్వానికి బీజేపీ అంటే భయం పట్టుకుందని, అందుకే ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపేందుకు సిద్ధమైన బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కక్కునూరు వెంకటేష్ గుప్తా తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్--2026 కార్యక్రమానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరవుతున్న నేపథ్యంలో, బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆయన విమర్శించారు.రాష్ట్ర అభివృ ద్ధి, పారిశ్రామిక ప్రగతి,పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పనవంటి లక్ష్యాలతో నిర్వహించాల్సిన భారత్ సమ్మి ట్‌ను కాంగ్రెస్ పార్టీ రాజకీయ వేదికగా మార్చడం సరికాదన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రావాలి, పెట్టుబడులు పెరగాలి, నిరు ద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా, కాంగ్రెస్ నాయ కులు రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని ప్రశ్నిం చారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని,శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ ముందస్తు అరెస్టుల ద్వారా బీజేపీ నాయకుల గొంతునొక్కాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను రాజకీయ ప్రయోజ నాల కోసం ఉపయోగించకుండా, ప్రజల సంక్షేమం, పరిశ్రమల స్థాపన, యువత భవిష్యత్తుపై ప్రభుత్వం దృష్టి సారించాలని కక్కు నూరు వెంకటేష్ గుప్తా డిమాండ్ చేశారు.

గ్రీన్ ఎస్ఎం క్యాబ్‌లను నిషేధించాలి : బీఎంఎస్-బీపీటీఎంఎం

నిషేధించకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన



శంషాబాద్.నవంబర్.15(ప్రజాదర్బార్ : తెలంగాణలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తున్న గ్రీన్ ఎస్ఎం ఎలక్ట్రిక్ క్యాబ్ సర్వీసులను వెంటనే నిషేధించాలని బీఎంఎస్ అనుబంధ తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ (బీపీటీఎంఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జేబీఎస్, శంషాబాద్ విమానాశ్రయం, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో బీపీటీఎంఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, జాతీయ ఉపాధ్యక్షుడు నంద కిషోర్, ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ముకేశ్ గౌడ్, ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్యగౌడ్, బీపీటీఎంఎం రాష్ట్రప్రధాన కార్యదర్శి కె. శ్రీధర్‌రెడ్డి, గ్రేటర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు జేబీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి శంకర్ అల్లూరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పేరుతో ఎలక్ట్రిక్ వాహనాల ముసుగులో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సొంతంగా ఆటోలు, ట్యాక్సీలు కొనుగోలు చేసి వాటి కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికడ్రైవర్ల పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జేబీఎస్, శంషాబాద్ విమానాశ్రయం, దిల్‌సుఖ్‌నగర్ వంటి కీలకప్రాంతాల్లో గ్రీన్ ఎస్ఎం సంస్థకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం వల్ల స్థానిక డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్ ఎస్ఎం సర్వీసులను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీపీటీఎంఎం జాతీయ ఉపాధ్యక్షుడు నందకిషోర్ మాట్లాడుతూ గ్రీన్ ఎస్ఎం సర్వీసులకారణంగా ఆటోడ్రైవర్ రోజుకు రూ.500నుంచి రూ.800 వరకు ఆదాయం కోల్పోతున్నారని, గతంలో రోజుకు 15 నుంచి 20 ట్రిప్పులు లభించేవని, ప్రస్తుతం ఐదు ట్రిప్పులు కూడా రావడంలేదని దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీఎంఎస్ ఆటో అండ్ ట్యాక్సీ రాష్ట్రఅధ్యక్షుడు చింతల నందకిషోర్ ఆధ్వర్యంలో నాయకులు కూడా గ్రీన్ ఎస్ఎం క్యాబ్ సర్వీసులను వ్యతిరేకించారు. తక్కువ ఛార్జీలతో సేవలు అందించడం వల్ల ఇప్పటికే పోటీని ఎదుర్కొంటున్న డ్రైవర్ల ఆదాయం మరింత తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం విదేశీ సంస్థలకు అనుమతులు ఇచ్చేముందు స్థానికఆటో, ట్యాక్సీడ్రైవర్లు, రవాణా కార్మిక సంఘాలతో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఆటో అండ్ ట్యాక్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్, రవి, గౌస్, శివ, కుమ్మరి రాజు, రాజుగౌడ్, లింగం, రమేష్, నరసింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రీన్ ఎస్ఎం క్యాబ్ సర్వీసులను నిషేధించి స్థానిక ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ జలహక్కుల ఉద్యమానికి విద్యాసాగర్‌రావు విశేష కృషి : వెంకట్‌రాంరెడ్డి



రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్) : తెలంగాణకు జరుగుతున్న నీటి అన్యాయాలను ప్రజలకు వివరించి, జలహక్కుల సాధనకోసం ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు ఆర్. విద్యాసాగర్‌రావు అని మాజీజడ్పీటీసీ, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంది వెంకట్‌రాంరెడ్డి అన్నారు. విద్యాసాగర్ రావు 87వ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో టీఎంసీల నీటి లెక్కలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, జలాశయాల పరిధి, నీటి వినియోగం వంటి అంశాలను సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా వివరించి జలహక్కులపై అవగాహన కల్పించారని కొనియాడారు. ఆయనతో పాటు పలువురు మేధావులు, ఉద్యమకారుల కృషి తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ప్రస్తుత పాలకులు విద్యాసాగర్ రావు ఆశయాలకు అనుగుణంగా తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. జలహక్కుల సాధనే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పంది వెంకట్ రాంరెడ్డి పేర్కొన్నారు.

చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో వైభవంగా పల్లకీ సేవ



రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్): షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం పల్లకీసేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీ సేవను వైభవంగా చేపట్టారు.ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి భక్తులు ఆలయ పరిసరాల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామ జయరామ.. జయ జయ రామ నామస్మరణతో పాటు భజనలు, భక్తి గీతాలు, ఆటపాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు.

భక్తులకు ప్రత్యేక పూజలు.. అన్నదానం : ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్య పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, ఎంపాని నరసింహులు, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, శ్రీశైలం యాదవ్, శంకర్ గౌడ్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసిరామ్, రఘునందన్‌రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, నరహరి, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్యతో పాటు భజన భక్త బృందం మహిళలు, తదితర భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బాల్ దివాస్ సంబరాలు



జిల్లేడు చౌదరిగూడ నవంబర్ 14 (ప్రజాదర్బార్): జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని చింతకుంట తండాలో జాతీయ బాలల దినోత్సవ వేడుకలను సర్పంచ్ దేవీరామ్‌చరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవీ రామ్ చరణ్ మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని యు..ప్రతి సంవత్సరం నవంబర్ 14న దేశవ్యాప్తంగా జాతీయ బాలల దినోత్సవాన్ని (బాల్ దివాస్) జరుపుకుంటామని తెలిపారు. పిల్లలంటే నెహ్రూకు ఎంతో ప్రేమాభిమానం ఉండేదని, నేటి బాలలే రేపటి భారతదేశ భవిష్యత్తు నిర్మాతలని ఆయన విశ్వసించేవారని పేర్కొన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, మంచి విలువలఅందించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యాయులు శ్వేత, నరేష్, అంగన్‌వాడీ టీచర్ సోనా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : షాద్‌నగర్ టౌన్ సీఐ సీతారాం

సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం, రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్‌లోని న్యూ కొత్తకోట పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ టౌన్ సీఐ సీతారాం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, ముఖ్యంగా విద్యార్థులు ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌హెచ్‌ఓ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులనుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను తెరవకూడదని, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాను మంచికి ఉపయోగించుకోవాలని, దాని దుర్వినియోగానికి దూరంగా ఉండాలని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. చెడు అలవాట్లకు ఆకర్షితులు కావద్దని, స్నేహితుల ఒత్తిడికి లోనై మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని హితవు పలికారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత :

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం, రహదారిపై ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని వివరించారు. రోడ్డు భద్రతపై చిన్నతనంనుంచే అవగాహన పెంపొందించుకోవాలని, ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకూ ప్రాధాన్యత:

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభ, చురుకైన భాగస్వామ్యాన్ని పాఠశాల చైర్మన్ రాజ వర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ చంద్రహాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ అరుంధతి అభినందించారు. అనంతరం పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా పాఠ్యేతర, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, నిరంతరం సాధన చేస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక బాధ్యత, వ్యక్తిగత భద్రత, ఆరోగ్యం, రోడ్డు భద్రతపై విలువైన సందేశం అందించారు.

విద్యార్థులకు బ్యాగులు, షూస్ పంపిణీ

ప్రభుత్వ పాఠశాలకు దాత దొండ వినోద్‌రెడ్డి చేయూత




ఇబ్రహీంపట్నం, నవంబర్ 14 (ప్రజాదర్బార్): పోల్కంపల్లి గ్రామ యువకుడు సామాజిక సేవా కార్యకర్త విద్యాభిమాని, దొండ వినోద్‌రెడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఏన్గల్ గూడ, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్ పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాలకు రంగులు వేయిస్తానని పాఠశాలకు ఏ అవసరం ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.ఈసందర్భంగా మండలవిద్యాధికారి హిరియా నాయక్, జడ్పీహెచ్ఎస్ రాయపోల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... దొండ వినోద్‌రెడ్డి సేవలను అభినందిస్తూ, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలలకు ఇలాంటి దాతల సహకారం అత్యంత అవసరమని తెలియజేశారు ఇంకా పాఠశాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందించాలని సూచించారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... పోల్కంపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ బహుమతులు అందజేస్తారని,గ్రామంలో నిరుపేద కుటుంబంలో ఎవరు మరణించిన వారికి ఆర్థిక సహా యం అందజేస్తారని,పోల్కంపల్లిగ్రామంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా భారీకేడ్లు కూడా ఏర్పాటు చేయించారని, పేద విద్యార్థులు చదువుకోవడానికి నిరంతరం ఆర్థికసహాయం చేసి విద్యార్థులను ప్రోత్సహిస్తూ మంచి విద్యాభిమానిగా సేవ కునిగా పోల్కంపల్లి, ఏనుగల్లుడా, మాన్యగూడ గ్రామాలలో మంచి పేరుప్రఖ్యాతలు సంపాదిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాలూవలా నరసింహ, సి.ఆర్.పి అశోక్, శేషు, గ్రామ వార్డ్ మెంబర్లు మమతనరేష్, యువకులు పూల నరేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిట్టలగూడలో ఉచిత పశు వైద్య శిబిరం



నందిగామ నవంబర్ 14 (ప్రజాదర్బార్): రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం పిట్టలగూడ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు అధికారులు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామసర్పంచ్ కొమ్ము కృష్ణ హాజరయ్యారు.పశు వైద్య అధికారులు రైతులకు తెలుపుతూ పశు పోషణ, దాణా, పరిశుభ్రత, రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పశు సంవర్ధక, వ్యవసాయానికి కావాల్సిన మార్గదర్శకాలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లి కుమార్‌గౌడ్, డైరెక్టర్ నరసింహులు, జిల్లెల్ల బాల్‌రెడ్డి, మాజీచైర్మన్ కుందారపు వెంకట్‌రెడ్డి, దారుర్ సతీష్ పటేల్, జంగయ్య, పశు వైద్య సిబ్బంది శ్రీశైలం, గంగిశెట్టి శ్రీశైలం, రాజేష్, నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వన భోజనాలు



షాబాద్ నవంబర్ 14 (ప్రజాదర్బార్): నాగర్‌గూడ గ్రామంలో శ్రీ కృష్ణ ఆలయంలోకార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో ఉసిరిచెట్టు పూజలు, వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,ఉసిరిచెట్టును దైవస్వరూపంగా భావిస్తూ భక్తులు పూజలు చేశారు. కార్తీక మాసంలో ఉసిరిచెట్టును పూజించడం హిందూ సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనదని, ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించడంవల్ల ఆధ్యాత్మిక ప్రశాంతత, సుఖసంతోషాలు కలుగుతాయని పెద్దలు పేర్కొన్నారు. భక్తులంతా కలిసి భజన లు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామస్తులందరూ కలిసి వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలత రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తీక మాసం ఆధ్యాత్మిక చింతనకు, భక్తిభావానికి ప్రతీకఅని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలపరుస్తాయని అన్నారు. గ్రామీణ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. గ్రామస్తులంతా కలిసిమెలిసి పండుగ వాతావరణంలో వన భోజనాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన అంజిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు ఏర్పాటు చేయగా, గ్రామస్తులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్): ఢిల్లీ వరల్డ్ స్కూల్, షాద్‌నగర్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.చిన్నారుల చిరునవ్వులు, ఆటపాటలు, ప్రత్యేక కార్యక్రమాలతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారు. పిల్లలంటే ఎంతో ఇష్టపడే నెహ్రూను చిన్నారులు ప్రేమగా చాచా నెహ్రూ అని పిలుచుకునేవారు. బాలల హక్కులు, విద్య, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, సర్వతోముఖ అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేసేలా ఈ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల సాధారణ దుస్తుల్లో పాఠశాలకు హాజరై వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు,ఆటలు, ఆసక్తికరమైన కార్యకలాపాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు తమలోని ప్రతిభను ప్రదర్శిస్తూ తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకున్నారు.

విద్యార్థుల ఆనందమే లక్ష్యంగా ప్రత్యేక ఏర్పాట్లు

బాలల దినోత్సవాన్ని విద్యార్థులకు చిరస్మరణీయంగా మార్చేం దుకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకారభావన పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారిలో మరింత ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని పేర్కొంది. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించడం ద్వారా విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడమే పాఠశాల లక్ష్యమని తెలిపింది. ఆనందోత్సాహాల మధ్య బాలల దినోత్సవ వేడుకలు ముగిశాయి. విద్యార్థుల కలలను ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభకు తగిన అవకాశాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు ఢిల్లీ వరల్డ్ స్కూల్, షాద్‌నగర్ నిరంతరం కృషి చేస్తోందని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.

కొందుర్గు పంచాయతీ కార్యాలయంలో ఘనంగా బాలల దినోత్సవ సంబరాలు : సర్పంచ్ ప్రభాకర్



కొందుర్గు నవంబర్ 14(ప్రజాదర్బార్): కొందుర్గు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు మంచి నడవడిక, విలువలు అలవర్చుకోవాలని, తమ ప్రతిభతో తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి గౌరవ ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. బాలల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. చాచా నెహ్రూ ఆశయాలు, పిల్లల పట్ల ఆయన చూపిన ప్రేమను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జిఆర్ఐ మాజీ డైరెక్టర్ వీపీ డిమ్రీకి ఉత్తరాఖండ్ గౌరవ్ సమ్మాన్



రంగారెడ్డి బ్యూరో 14 నవంబర్ (ప్రజాదర్బార్): ప్రముఖ భూభౌతిక శాస్త్రవేత్త, హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్ జి ఆర్ ఐ) మాజీ డైరెక్టర్ పద్మశ్రీ ప్రొఫెసర్ డా. విజయ్‌ప్రసాద్‌డిమ్రీకి అరుదైన గౌరవం లభించింది. విజ్ఞానశాస్త్రం, సమాజ సేవకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు ఉత్తరాఖండ్ గౌరవ్ సమ్మాన్-2026 పురస్కారం ప్రదానం చేశారు. నవంబరు 11న లక్నోలో జరిగిన ఉత్తరాఖండ్ మహోత్సవ ప్రారంభోత్సవంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నుంచి ఆయన పురస్కారం అందుకున్నారు. ఇదే ఏడాది యూరోపియన్ జియోసైన్సెస్ యూనియన్ (ఈజీయూ)నుంచి ప్రతిష్టాత్మక క్రిస్టియాన్ హ్యూజెన్స్ మెడల్-2026ను కూడా ప్రొఫెసర్ డిగ్రీ అందుకున్నారు. అన్వేషణ భూభౌతిక శాస్త్రంలో గ్రావిటీ, మాగ్నెటిక్ క్షేత్రాల అధ్యయనానికి ఫ్రాక్టల్ జ్యామితి, స్కేలింగ్ విధానాలను అన్వయించడంలో చేసిన విశేష పరిశోధనలకు ఈ గుర్తింపు లభిం చింది. ఐదు దశాబ్దాలకు పైగా ఎన్జీఆర్ఐతో అనుబంధం కలిగిన డిగ్రీ 1970లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా తన ప్రస్థానాన్ని ప్రారం భించారు. అనంతరం సంస్థ డైరెక్టర్ గా 2001 అక్టోబరు నుంచి 2010ఫిబ్రవరివరకు సేవలందించారు. ఫ్రాక్టల్‌మోడలింగ్, ఇన్వర్స్ థియరీ, సిగ్నల్ ప్రాసెసింగ్, గ్రావిటీ, మాగ్నెటిక్ అనామలీల విశ్లేషణ వంటిరంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ గుర్తింపు పొందాయి. ఖనిజాలు, చమురు, సహజవాయువు అన్వేషణతో పాటు భూగర్భ జలాల అధ్యయనం, కార్బన్ డయాక్సైడ్ నిల్వ పరిశోధనల్లోనూ ఆయన పరిశోధనలు ఉపయోగపడుతున్నాయి. 150కి పైగా పరిశోధనా పత్రాలు, పలు పుస్తకాలను ప్రచురించిన ఆయనకు 2010లో పద్మశ్రీ పురస్కారం లభించింది. 2007లో ఏజీయూ లోరెంజ్ అవార్డు లెక్చర్, 2010లో ఏఓజీఎస్ ఆక్స్‌ఫర్డ్ లెక్చర్, 2013లో జాతీయ భూవిజ న పురస్కారం సహా పలు గౌరవాలు దక్కాయి. 2007లో సంక్లిష్ట భౌగోళిక నిర్మాణాల నమూనాల రూపకల్పనకు సంబంధించిన పరిశోధనకు అమెరికా పేటెంట్ కూడా పొందారు. తమ సంస్థ మాజీ డైరెక్టర్కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమని సీఎస్ఐఆర్ ఎన్జీఆర్ హర్షం వ్యక్తం చేసింది. ఆయన పరిశోధనలు భూవిజ్ఞాన శాస్త్రవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంది.

పిల్లలపై ప్రేమతో కూడిన సమాజాన్ని నిర్మించాలి : సర్పంచ్ శ్రీశైలం



నందిగామ నవంబర్ 14(ప్రజాదర్బార్): నందిగామ మండలం చేగుర్ గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మంకాల శ్రీశైలం అధ్యక్షతన బాలల దినోత్సవం పురస్కరించుకొని బాలసభ నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ తెలుపుతూ పిల్లల కలలను ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను వెలికితీస్తూ, ప్రేమతో కూడిన సమాజాన్ని నిర్మించాలని, వారితో తల్లిదండ్రులు, అధ్యాపకులు ప్రేమగా ఉంటూ సలహాలు సూచనలు ఇస్తూ మెలగాలని అపుడే వారు ధైర్యంగా మానసికంగా బలంగా ఉంటారని, ప్రతి చిన్నారి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, నిండుగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుల మందా శివశంకర్, రాజిరెడ్డి, రాజశేఖర్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

అఖిల భారత రైతు సంగం 36వ మహాసభలను జయప్రదం చేద్దాం

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోస్టర్ రిలీజ్ చేసిన రైతు సంఘం



మహేశ్వరం, నవంబర్ 14 (ప్రజాదర్బార్): మహేశ్వరం నియోజక వర్గంలోని కందుకూరు మండలం. తెలంగాణ సాయుధ పోరాట పురిటిగడ్డ నల్లగొండలో జరిగే అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కందుకూరు మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గోడ పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బాక రామచందర్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్రాజ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం సర్కార్ సైన్యాలు ఆనాటి నెహ్రూ సైన్యాలు వ్యతిరేకంగా దున్నే వాడికి భూమి కావాలని వెట్టిచాకిరి పోవాలని ఈడ కావాలని 4000 మంది అమరవీరులు నెత్తురోడిన నేల భాంచాన్ని కాలు మొక్కుతానని అన్న పేదలతో బంధువులు పట్టించి నిజాం సర్కారు సైన్యాలను కాంగ్రెస్ పోలీసులను తరిమికొట్టిన గడ్డలు అఖిలభారత రైతు సంఘం 36వ మహాసభలకు పెద్ద ఎత్తున రైతులు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను తెచ్చి రైతుల భూములను కార్పోరేట్లకు దారా దత్తం చేసే నల్ల చట్టాలను తీసుకువచ్చిందని దానికి వ్యతిరేకంగా లక్షలాది మంది రైతులు గత రెండు సంవత్సరాల క్రితం వీరోచితంగా చలిని ఎండను వానను ఎదిరించి నిలిచి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రోడ్ల పక్కన వంటలు చేసుకుని కొన్ని నెలలు పోరాటం చేసి నరేంద్ర మోడీ తెచ్చిన రైతు చట్టాలను వెనక్కి రైతుల సత్తా ఏమిటో కేంద్ర ప్రభుత్వానికి చూపించారు కానీ దొడ్డిదారిన మళ్ళీ నల్ల చట్టాలను తేవాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది జై జవాన్ జై కిసాన్ అని నినదించే ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆహారాన్ని అందిస్తూ తమ జీవితాలను అప్పుల పాలు చేసుకుంటున్నా రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలంటే రైతులకు రక్షణగా ఉండే చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలి సబ్సిడీ ద్వారా రైతులకు రుణాలు గాని మందులు రసాయనిక ఎరువులు అందించి రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చట్టాలు చేయాలని లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలో ఉంచేయడం తమ కోరికలను రైతులు నెరవేర్చుకుంటారని సకాలంలో వానలు రాక భూమిలో వేసిన విత్తనాలు పెట్టిన పెట్టుబడులు ఎలక దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారని ప్రభుత్వాలు స్పందించి కరువు పరిస్థితుల నుండి రైతులు గట్టిగించడానికి సరియైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయం ఉంటేనే రాజకీయ నాయకులకు పెట్టుబడిదారులకు ప్రజలకు నోటికి బుక్కనందించి బువ్వ పెట్టి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని రైతులు సంఘటితమై రైతు చట్టాలను అమలు చేసే విధంగా ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు నిర్వహించాలని నల్లగొండలో రేపటినుండి 18 వ తారీకు వరకు జరిగే మహాసభలను జయప్రదం చేయాలని 15 తారీకున జరిగే భారీ బహిరంగ సభకు లక్షలాదిమంది రైతులు తరలిరావాలని ఈ సందర్భంగా వారు కోరారు ఈ యొక్క కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అంకగళ్ల కుమార్ బుడ్డి రపు శ్రీనివాస్, సిపిఎం నాయకులు రావికంటి శేఖర్, సత్యం, యాదయ్య, జంగయ్య, రాములమ్మ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ : మర్రి నిరంజన్‌రెడ్డి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 14 (ప్రజాదర్బార్): పేదల వైద్యానికి భరోసా, ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్ అని టిపిసిసి సభ్యులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల పరిధిలోని ఆంబోథ్ తండాకు చెందిన రాట్ల తర్యా 60000/-, నేనావత్ బిచ్య 26000/- బండాలెమూర్ గ్రామానికి చెందిన పాత్ లోత్ నిల 53,500/- రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు అందించామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంద్వారా మంజూరైన ముఖ్య మంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అర్హులైన లబ్ధి దారులకు శనివారం అంబోత్ తండ గ్రామానికి విచ్చేసి నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి అండగా ఉంటామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌తో పాటు అవసరమైన వారికి ఎల్ఓసీలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం తన బాధ్యత అని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లొ సర్పంచ్ రాణి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సుమన్, నాయకులు సామల రాజేందర్ రెడ్డి, హరి నాయక్ , గోపి, లచ్చు, కుమార్, మోహన్ మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో ముగిసిన హ్యాండ్లూమ్ ఎక్స్పో

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి,నవంబర్ 14 (ప్రజాదర్బార్): ఉప్పల్ మినీ శిల్పారామంలో గత 14 రోజుల నుండి నిర్వహిస్తున్న స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్పో శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిరంజనా నాగరాజు శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో వినాయక కౌతం, పుష్పాంజలి, గరుడ గమన, నమశ్శివాయతే, జతిస్వరం, లలిత హారతి, చక్కని తల్లికి, ఝుమ్ ఝుమ్ తనను, ఇందరికి భయము, రామచంద్రయ్య తదితర అంశాలను కళాకారులు శివారాధ్య, భవ్యశ్రీ.సహస్ర, ప్రణవి, రచన, పూర్వి, కావ్యశ్రీ, నిత్య, రిత్తన్యా తదితరులు ప్రదర్శించి మెప్పించారు.



రామంతాపూర్‌లో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 14 (ప్రజాదర్బార్): ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు శనివారం రామంతాపూర్ డివిజన్‌లో ఐదుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ గంథం జ్యోత్స్నా నాగేశ్వరరావు ఆదేశాల బిఆర్ఎస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ నాయకులు చాంద్ పాషా, మోహన్ బాబు, ఆపిల్ శ్రీనివాస్, రాజు, మద్దూరి శ్రీనివాస్, లడ్డు, బాలకృష్ణ తదితరులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. రామంతాపూర్ కు చెందిన రాజశేఖర్ (నేతాజీ నగర్) రూ.55,500, నస్రత్ సుల్తానా (ఇందిరానగర్) – రూ. 39,000, పాపయ్య (ఆర్టీసీ కాలనీ) రూ.21,000, కమలమ్మ (వివేక్ నగర్) రూ. 25,500, భారతి (కేసీఆర్ నగర్) రూ.26,500లకు చెక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలను మోసం చేసిన రాహుల్ గాంధీ గో బ్యాక్..!

హామీలు నెరవేర్చాకే తెలంగాణ గడ్డపై అడుగుపెట్టాలి

పోలీసుల నిర్బంధాలతో ప్రజాగళాన్ని అణచలేరు: బీజేపీ నాయకులు రామ్‌లక్ష్మణ్



జిల్లేడు చౌదరిగూడ నవంబర్ 14 (ప్రజాదర్బార్): ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసంచేస్తోందని చౌదరిగూడ మండల బీజేపీ నాయకులు రామ్ లక్ష్మణ్ విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాహుల్‌గాంధీ తెలంగాణలో పర్యటించ డమేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి వచ్చేముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షం లో తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాల ని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ పర్యటనను నిరసిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు సిద్ధమైన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా నిర్బం ధించడం అప్రజాస్వామిక చర్య అని రామ్ లక్ష్మణ్ మండి పడ్డారు. పోలీసుల నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతును నొక్కలేరని, ప్రజల తరఫున ప్రశ్నించే హక్కును కాల రాయ డం సరికాదని అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమ లు చేయకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ను నెరవేర్చే వరకు బీజేపీ ప్రజాక్షేత్రంలో తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని రామ్ లక్ష్మణ్ పేర్కొన్నారు.

మందు బాబులకు కోరు జలక్..!

భారీగా జరిమానాలు విధించిన కోర్టు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 13 మందికి జరిమానా విధించిన ఇబ్రహీంపట్నం కోర్టు





రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 14 (ప్రజాదర్బార్): మందుబాబులకు కోర్టు ఊహించని జలక్ ఇచ్చింది. సాగర్ రహదారిపై తరచూ ఇటు ట్రాఫిక్ పోలీసులు అటు లా అండ్ ఆర్డర్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13 మందికి ఇబ్రహీం పట్నం కోర్టు జరిమానాలు విధించి మందుబాబులకు ఊహించని షాక్‌ను ఇచ్చింది. శనివారం రోజు ఈ కేసుల ను విచారించిన న్యాయస్థానం నిందితులకు జరిమానాల తో పాటు ఇద్దరికి రెండు రోజుల రోడ్డు ట్రాఫిక్ విధులను విధించింది. యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మద్యం సేవించి వాహనా లు నడుపుతూ పట్టుబడిన 13 మందిని ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపరచగా, కేసులను విచారించిన న్యాయ స్థానం ఆరుగురికి రూ.5 వేల చొప్పున, ఇద్దరికి రూ.6 వేల చొప్పున, ఒకరికి రూ.7 వేలు, ఇద్దరికి రూ.8 వేల చొప్పున, మరో ఇద్దరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా మరోఇద్దరికి 2 రోజులపాటు ట్రాఫిక్ విధులను విధించింది. ఈ సందర్భంగా సిఐ నందీ శ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన 13 మందికి యాచారం పోలీస్ స్టేషన్లో రహదారి భద్రతపై ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించామని అన్నారు. రోడ్లపై మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రాణాలకు ముప్పు కలగడమే కాకుండా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయ న హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్రయాణిం చాలని ఆయన కోరారు.

దేశాభివృద్ధికి నెహ్రూ వేసిన పునాదులు చిరస్మరణీయం

నేటి యువతకు నెహ్రూ జీవితం ఆదర్శం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రంగారెడ్డి బ్యూరో, 14 నవంబర్ (ప్రజాదర్బార్) : భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ కుటుంబం చేసిన సేవలు, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మోతీలాల్ నెహ్రూ తన ఆస్తులను సైతం దేశం కోసం త్యాగం చేశారని గుర్తుచేశారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో జవహర్‌లాల్ నెహ్రూ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

దేశాభివృద్ధికి బలమైన పునాదులు

స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నెహ్రూ, ఎన్నో సవాళ్ల మధ్య భారతదేశ అభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేశారని ఎమ్మెల్యే కొనియాడారు. భారీ పరిశ్రమల స్థాపన, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం, విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. దేశాన్ని పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించేం దుకు ఆయన తీసుకున్న నిర్ణయాలు ఎంతో కీలకమని అన్నారు.

యువత నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

అంతర్జాతీయస్థాయిలో అలీనోద్యమానికి నాయకత్వం వహిస్తూ ప్రపం చ దేశాల మధ్య భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసు కొచ్చారని పేర్కొన్నారు. నెహ్రూ ఆశయాలు, దేశం పట్ల ఆయన కున్న అంకిత భావం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశ సమగ్ర అభివృద్ధికి తమ వంతు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు.